
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 10 జూలై 2025



కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ. 9,78,872

జగదేవ్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. 89 రోజులకుగాను రూ.9,78,872 నగదుతో పాటు 0578 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి ఆభరణాలు హుండీ ద్వారా ఆదాయం సమకూరినట్లు దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈవో రవికుమార్‌లు తెలిపారు.



సార్వత్రిక సమ్మెలో భాగంగా
సిద్దిపేటలో కార్మిక సంఘాల ర్యాలీ

కార్మిక కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు
- సార్వత్రిక సమ్మెలో ఉమ్మడి జిల్లాలో నిరసనలు

7

ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం

అఖిల భారత విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో 77వ జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ నాయకులు సిద్దిపేటలోని స్థానిక వీర సావర్కర్ చౌరస్తాలో ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం అక్కడి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ సుర్వి మణికంఠ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్, అగ్రివిజన్ కన్వీనర్ మానస, నగర కార్యదర్శి పరశురాం, జోనల్ ఇన్‌చార్జులు భాను, అనిష్, నగర ఉపాధ్యక్షుడు వసంత్ లోకేష్, సంయుక్త కార్యదర్శులు ధర్మతేజ, వివేక్, శ్రీనివాస్. కార్యవర్గ సభ్యులు రోహిత్, ఉదయ్, భాను మధు, చరణ్, తేజ, మణిచరణ్ పూర్వకార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

- సిద్దిపేట క్రైం, జూలై 9



సిద్దిపేట లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు



శాకాంబరిగా విద్యాసరస్వతి

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఆషాఢమాసం, మూలమహోత్సం సందర్భంగా విద్యాసరస్వతీ అమ్మవారు బుధవారం భక్తులకు శాకాంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో మూల వేడుకలు, ఆషాఢ మాసం సందర్భంగా విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ మండపాన్ని కూడా కూరగాయలు, పూలతో అలంకరించారు. యేటా విద్యాధరి క్షేత్రంలో మూలనక్షత్రం మహోత్సవం సందర్భంగా శాకాంబరి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ తెలిపారు.

- వర్గల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి)

చేయూత ఏదీ?

- ఇప్పటికే పాత పెన్షనే
- జిల్లా వ్యాప్తంగా 1,85,091 మంది లబ్ధిదారులు
- పెన్షన్ కోసం 15,858 దరఖాస్తులు
- కాంగ్రెస్ ఇస్తామన్న పెంపుపై ఆశలు

చేయూత పథకం కోసం అర్హులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, టేకేదారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. గతంలో అర్హులుగా ఉన్న వయసును తగ్గించడంతో జిల్లావ్యాప్తంగా నూతన పెన్షన్ పొందేందుకు 15 వేలకు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ దరఖాస్తులకు మోక్షం లభిస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద జిల్లావ్యాప్తంగా 1,85,091 మందికి పెన్షన్‌ను అందిస్తున్నది. అందుకు గానూ ప్రతి నెలా రూ. 40.04 కోట్ల నిధులు విడుదల చేసి నేరుగా పెన్షన్‌దారుల అకౌంట్‌లో జమ చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, టేకేదారులకు దాదాపు 11 రకాలుగా ప్రభుత్వం పెన్షన్‌ను అందిస్తున్నది. వీరిలో దివ్యాంగులకు రూ.4,016 మినహా మిగతా అందరికీ రూ. 2,016 అందిస్తున్నది. వీరిలో అత్యధికంగా 58,722 మంది వృద్ధులు పెన్షన్‌ను పొందుతుండగా వీరికి రూ. 11.83 కోట్లు, 13,670 మంది దివ్యాంగులకు రూ.5.48 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.

15,858 మంది దరఖాస్తు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పెన్షన్‌కు ఉన్న అర్హత వయస్సును 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు కుదించింది. దీంతో వృద్ధులతో పాటు అర్హులైన వితంతువులు, వికలాంగులు, కల్లుగీతా కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, టేకేదారులు నూతన పెన్షన్ కోసం మూడున్నరేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువగా వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు దరఖాస్తులున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో



జిల్లాలో నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు

1	వృద్ధులు	6,381
2	వితంతువులు	4,567
3	దివ్యాంగులు	963
4	కల్లుగీత కార్మికులు	529
5	చేనేత కార్మికులు	250
6	ఒంటరి మహిళలు	271
7	బీడీ కార్మికులు	2,894
8	టేకేదారులు	3
	మొత్తం	15,858

పాత పెన్షన్‌దారులు

క్ర.స	నియోజకవర్గం	పెన్షన్‌దారులు	నిధులు
1	సిద్దిపేట	50,497	రూ.10,76,49,952
2	దుబ్బాక	49,601	రూ.10,51,65,616
3	గజ్వేల్	39,502	రూ.8,50,00,032
4	హుస్నాబాద్	20,298	రూ.4,68,34,768
5	జనగామ (చేర్యాల, చేర్యాలటౌన్, కొమురవెల్లి మద్దూరు)	19,554	రూ.4,31,40,864
6	బెజ్జంకి(మానకొండూరు)	5,639	రూ. 1,26,92,224
	మొత్తం		రూ. 40,04,83,456

కానరాలేదా.. కరిగిపోయారా

- ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ ప్రశ్నార్థకమేనన్న అధికారులు
- సిగాచి పరిశ్రమ ప్రమాదానికి 11 రోజులు
- రెస్క్యూ బృందాల తనిఖీల్లోనూ నిష్ఫలితం
- గల్లంతైనవారి కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున పరిహారం అందజేత

7

అభివృద్ధి భేష్

- మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం కితాబు

సిద్దిపేటరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం సభ్యులు కితాబునిచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేటరూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల బృందం సందర్శించారు. గ్రామంలో చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీ, డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవోలు విష్ణు, శ్రీనివాస్‌రావు, మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, జీవన్‌రెడ్డి, కారోబార్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నగుండవెల్లి గ్రామంలో
మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం

డీసీసీ కార్యవర్గంలో సామాజిక న్యాయం జరిగేలా చూడండి

- ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలతో మంత్రి పొన్నం

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) కార్యవర్గం కూర్పులో సామాజిక న్యాయం జరిగేలా చూడాలని పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. యువతకు పెద్ద పీట వేయాలని, మహిళలకు అవకాశం కల్పించాలని సూచించారు. టీపీసీసీ.. డీసీసీ కార్యవర్గాల ఏర్పాటు కోసం ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జులను నియమించింది. అందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు మంత్రి పొన్నంకు పగ్గాలు అప్పగించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, పరిశీలకులు తదితరులతో బుధవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 13లోపు డీసీసీ ఆశావహుల జాబితాను రూపొందించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 14న సిద్దిపేట, సంగారెడ్డి డీసీసీ కార్యవర్గం ఆశావహులతో ఇందిరాభవన్‌లో సమావేశం అవుతానని ఆయన పేర్కొన్నారు.



దోస్త్ పట్టని విద్యార్థులు

- డిగ్రీ ప్రవేశాలకు స్పందన కరువు
- సిద్దిపేట అటానమస్ కళాశాల మినహా..
- మూడు విడతల్లోనూ చేరని లక్ష్యం
- కొన్ని ప్రైవేటు కళాశాలలూ మూత
- వృత్తి విద్యాకోర్సులకు కూడా అనాసక్తి

కళాశాల	సీట్లు	చేరింది
సిద్దిపేట (మహిళా)	240	127
దుబ్బాక	300	73
హుస్నాబాద్	240	72
చేర్యాల	240	58
గజ్వేల్ (బాలుర)	360	291
గజ్వేల్ (మహిళా)	660	212

దుబ్బాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు డిగ్రీ చదివేందుకు ఆసక్తి చూపేవారు. క్రమంగా విద్యార్థులు డిగ్రీపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా విద్యార్థులు లేక డిగ్రీ కళాశాలలు కూడా మూతపడుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 'దోస్త్' ద్వారా దరఖాస్తులు, ప్రవేశాలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. సిద్దిపేట అటానమస్ కళాశాల మినహా, ఆరు ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో అనుకున్న మేర విద్యార్థులు చేరకపోవడంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. అటు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిస్థితి కూడా అలాగే ఉంది. యేటా జిల్లాలో ప్రైవేట్ కాలేజీలు మూతపడుతున్నాయి. విద్యార్థులు ఎక్కువగా వృత్తివిద్యా కోర్సులు, చదువు పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలు పొందే వాటిపై దృష్టిసారిస్తుండడంతో డిగ్రీ కళాశాలల్లో సంఖ్య క్రమంగా తగ్గుతుంది.

ఈ ఏడాది సిద్దిపేట అటానమస్ డిగ్రీ కళాశాల మినహా, జిల్లాలోని ఆరు డిగ్రీ కళాశాలల్లో సగం మంది కూడా చేరలేదు. సిద్దిపేట కాలేజీలో 1650 సీట్లు ఉండగా వెయ్యి మంది మాత్రమే చేరారు. అది కూడా ఆ కళాశాలకు ఎంతో చరిత్ర ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను అందులో చేర్పించేందుకు ఆసక్తి చూపతున్నారు. ఆ కాలేజీ చుట్టూ రెండు ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలు, బీసీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలు ఉండడం కూడా విద్యార్థులు చేరేం దుకు ఆసక్తి చూపుతున్నారు. గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్‌సీ హెల్త్ మెనేజ్‌మెంట్ కోర్సును ప్రత్యేకంగా ప్రవేశపెట్టినా కూడా ఏడుగురు మాత్రమే చేరారు.

ప్రైవేట్ కాలేజీల పరిస్థితి అంతే..

గతంలో ఫీజురీయింబర్స్‌తో విద్యను అందించిన పలు ప్రైవేట్ కాలేజీలు ప్రస్తుతం సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో దుబ్బాకలో రెండు, గజ్వేల్‌లో నాలుగు, హుస్నాబాద్‌లో రెండు మూతపడ్డాయి. చేర్యాలలో ఆరు ప్రైవేటు కాలేజీలుంటే రెండు మాత్రమే కొనసాగుతున్నాయి. సిద్దిపేటలో 12 డిగ్రీ కాలేజీలు ఉండగా ప్రస్తుతం మూడు మాత్రమే మిగిలాయి.

దోస్త్ రిజిస్ట్రేషన్‌కు అధ్యాపకుల డబ్బు

కొన్ని కళాశాలల్లో రిజిస్ట్రేషన్ ఖర్చులను అధ్యాపకులే చాలా వరకు చెల్లించారు. అయినా కూడా స్పందనలేదు. ఇంటింటా తిరిగి అవగాహన కల్పించినా కూడా అనుకున్న మేర లక్ష్యం చేరలేదు.

కనీస వసతులు కరువు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు లేవు. సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. కాలేజీలు ఊరికి దూరంగా ఉండడం కూడా కారణం. ప్రధానంగా వసతి గృహాలు లేక పట్టణాలకు బాటపడుతున్నారు. కొందరికి చదువుకోవాలని ఉన్నా హాస్టళ్ల లేక ఆసక్తి చూపడం లేదు.

మధ్యాహ్నభోజనంపై కలెక్టర్ ఆరా

- స్వయంగా పాఠశాలలకు వెళ్లి తనిఖీ
- ఇతర అధికారులకూ ఆదేశాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని పోస్ట్ చేసిన హరీశ్, కేటీఆర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 9: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా మారిందని "సాంబారుతోనే సరి" శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. విద్యార్థులతో పాటు వంట చేసి పెడుతున్న ఏజెన్సీ నిర్వాహకుల సమస్యలకు కథనం అద్దం పట్టింది. దీంతో కలెక్టర్ హైమావతి స్పందించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తొగుట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వయంగా కలెక్టర్ తనిఖీ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పాటించకపోవడంపై మండిపడ్డారు. ఇక 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్టు చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో పోస్టు చేసి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.



ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్టు చేసిన కేటీఆర్, ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన హరీశ్‌రావు

నేనూ ఒకప్పుడు టీచర్‌నే

- మెనూ ప్రకారం భోజనం లేకుంటే చర్యలు : కలెక్టర్

తొగుట/సిద్దిపేటక్రైం జూలై 9 (ఆంధ్రజ్యోతి): "నేను ఒకప్పుడు టీచర్‌నే.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజు సాంబారు.. కోడిగుడ్డునే పెడతారా..? మెనూ ప్రకారం భోజనం లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని" కలెక్టర్ హైమావతి ఉపాధ్యాయులను హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజన తీరుతెన్నులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం లేకపోవడంతో ఆ వివరాలను డీఈవోకు పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచిగా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తొగుటలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్‌ను, నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. సిద్దిపేట మున్సిపాలిటీలోని 37, 20 వార్డుల్లో పర్యటించి పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

సర్కారు బడుల్లో ఆకస్మిక తనిఖీలు 8

పూజారులు, దాతలు లేకుండానే!

- కొండపోచమ్మ ఆలయ కమిటీపై రుసరుసలు

జగదేవ్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ ఆలయ కమిటీపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పూజారులు, దాతలు లేకుండా కమిటీ ఎలా వేస్తారంటూ స్థానికులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు ఆలయ పాలకవర్గ కమిటీలో సభ్యులతో పాటు ఆలయ పూజారులు, అమ్మ వారికి సేవ చేసిన వారు, ఆలయాభివృద్ధికి సహకరించిన దాతలకు కమిటీలో చోటు కల్పిస్తారు. కానీ ఆలయ పునర్నిర్మాణం కమిటీలో వారికి అవకాశం కల్పించకపోవడంతో ఆలయ పూజారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కొండపోచమ్మ ఆలయం పునర్నిర్మాణం కమిటీ సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారని ఆలయ ఈవో రవి కుమార్ తెలిపారు.



కొండపోచమ్మ ఆలయం

ప్రశాంతంగా ఎప్‌సెట్ కౌన్సెలింగ్

● ఎనిమిది రోజుల్లో 3800 మంది విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 2025 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించిన ఎప్‌సెట్ టీజీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి మండలం హనుమాననగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1వ తేది నుంచి 8వ తేది వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌ను ఎనిమిది రోజుల పాటు రోజుకు 480 మంది విద్యార్థుల చొప్పున నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి తెలిపారు. ఎనిమిది రోజుల్లో మొత్తం 3800 మంది విద్యార్థుల ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, ఆధార్‌కార్డు, తదితర ధృవపత్రాలను పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఈ కౌన్సెలింగ్‌లలో కళాశాల సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ శక్తి కిరణ్, అధ్యాపకుడు శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ , టిప్పర్‌లు స్వాధీనం



జోగిపేట పోలిస్ స్టేషన్‌లో టిప్పర్, ఎక్స్‌కవేటర్ వాహనాలు

జోగిపేట రూరల్, జూలై 9 (ఆంధ్ర జ్యోతి): జోగిపేట పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ , టిప్పర్‌లు బుధవారం పోలీస్ స్టేషన్‌లో దర్శనమిచ్చాయి. కొన్ని రోజులుగా అందోల్ మండల పరిధిలో విచ్చలవిడిగా కొంత మంది మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ , టిప్పర్ వాహనాలను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా భూమి పౌతీ చేసేందుకు ఆడపడుచులు రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన బుధవారం అల్లిపూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తన తల్లిదండ్రులు మృతి చెందడంతో వారి పేరు మీద ఉన్న 26 గుంటల భూమిని ముగ్గురు అన్నదమ్ములు పౌతీ చేసుకునేందుకు రెండు సంవత్సరాలుగా ఆడపడుచులను రమ్మని కోరుతున్నారు. వారు ఎంతకు రాకపోవడంతో శుక్రవారం వృద్ధుడు గ్రామస్థులను తీసుకొని ఆడపడుచుల ఊరికి వెళ్లి పౌతీ చేయించమని చెప్పించినా వారు నిరాకరించారు. దీంతో మనోవేదనకు గురైన వృద్ధుడు తిరుగు ప్రయాణంలో గ్రామస్థులకు తెలియకుండా ఇటుక బట్టీల సమీపంలోకి వెళ్లి తమ్ముడికి ఫోన్ చేసి నేను బతకను అని చెప్పి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఘటనా స్థలానికి వెళ్లిన కుటుంబీకులు, గ్రామస్థులు వృద్ధుడిని ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

తోడికోడళ్లు అదృశ్యం

రామాయంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణానికి చెందిన తోడికోడళ్లు అదృశ్యమయ్యారు. ఇంట్లో చిన్నపాటి గొడవల కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు బుధవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే.. రెడ్డి కాలనీకి చెందిన అక్కలు, హనుమాన్, తన సోదరుడు రోజూలాగే భోజనం చేసి నిద్రించారు. తెల్లవారు జామున లేచేసరికి హనుమాన్ భార్య, మరదలు (తోడికోడళ్ళు) మౌనిక, అరుణ ఇంట్లో కనిపించలేదు. వారి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లాభం లేదు. దీంతో హనుమాన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మునిపల్లి, జులై 9 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం తాటిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన గోల్ల విజయ్ కుమార్(19) అనే యువకుడు సదాశివపేట మండలంలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న (సోమవారం) ఉదయం పొలానికి వెళ్లిన విజయ్ కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి వెళ్లి చూడగా అప్పటికే విజయ్ కుమార్ పురుగుల మందుతాగి పడిపోయి ఉన్నాడు. బాధితుడిని 108 వాహనంలో సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి గాంధీ అసుపత్రికి ఈ నెల 8న తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కనకరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

మనోవేదనతో యువకుడు..

నాగల్‌గిద్ద, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. ఈ సంఘటన బుధవారం నాగల్‌గిద్ద మండలం కిషన్ నాయక్ తండాలో జరిగింది. నాగల్‌గిద్ద ఎస్సై జి.సాయిలు తెలిపిన వివరాల ప్రకారం... కిషన్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ ప్రకాష్ (36) మద్యానికి బానిసై ఫైల్స్ వ్యాధితో కొన్ని రోజులుగా బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈవిషయమై అతడు మనోవేదనకు గురై బాధలు భరించలేక బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాష్ భార్య పార్వతిభాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మనోహరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసు పండారి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన దప్పు ప్రవీణ్‌కుమార్(25) తండ్రి రెండు నెలల కితం చనిపోయాడు. దీంతో ప్రవీణ్‌కుమార్ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. దీంతో మద్యానికి బానిసై, అప్పులు చేయడంతో వాటిని తీర్చలేక గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌పై పడుకోవడంతో రైలు ఢీకొని చనిపోయాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించగా, సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




















కానరాలేదా.. కరిగిపోయారా

- ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ ప్రశ్నార్థకమేనన్న అధికారులు
- సిగాచి పరిశ్రమ ప్రమాదానికి 11 రోజులు
- రెస్క్యూ బృందాల తనిఖీల్లోనూ నిష్ఫలితం
- గల్లంతైనవారి కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున పరిహారం అందజేత
- మిగతా పరిహారంపై 3 నెలల తర్వాతే నిర్ణయం
- గాలింపు చర్యలు కొనసాగుతాయని ప్రకటన



సిగాచి రియాక్టర్ పేలుడు ప్రమాదంలో గల్లంతయిన కార్మికులు

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూలై 9: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించి నేటికి 11 రోజులు. ప్రమాదంలో అక్కడికక్కడే 36 మంది చనిపోయినట్లుగా అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరో 8 మంది మృతిచెందారు. మొత్తం మృతుల సంఖ్య 44కు చేరింది. ఇక ప్రమాదం జరిగిన రోజు నుంచి 8మంది ఆచూకీ లభించడం లేదు. వీరి ఆచూకీ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, పోలీసు బృందాలు పదిరోజుల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఇంకా వెతుకుతూనే ఉన్నారు. 44 మంది చనిపోగా వీరిలో దాదాపు 30 మృతదేహాలను కనుగొనడం వైద్యులు, ఫోరెన్సిక్ బృందాలకు కష్టతరమైంది. పూర్తిగా కాలిపోయిన మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు కూడా గుర్తుపట్టలేదు. అందుకే డీఎన్‌ఏ పరీక్షలతో నిగ్గు తేల్చారు. చనిపోయిన వారి కుటుంబసభ్యుల రక్తం శాంపిల్స్ సేకరించి మృతదేహాల డీఎన్‌ఏతో పోల్చి వారం రోజుల్లోనే ఏ మృతదేహం ఎవరిదో అప్పగించారు. గడిచిన మూడు రోజుల్లో ప్రమాదం జరిగిన స్థలంలో దాదాపు 70 మాంసపు ముక్కలు, ఎముకలు, దంతాలను ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు. ఈ అవశేషాల్లో కూడా గల్లంతైన 8మంది ఆచూకీ కానరాకపోవడం గమనార్హం. లభ్యమైన మాంసపు అవశేషాలు సైతం గతంలో గుర్తించిన మృతులవేనని తేల్చారు. మరో మూడు ముక్కలు మాత్రమే మిగిలాయని డీఎన్‌ఏ పరీక్షలకు పంపించినట్లుగా అధికారులు చెబుతున్నారు.



గల్లంతైనవారి కుటుంబసభ్యులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

బూడిద కూడా గల్లంతే..

సాధారణంగా బూడిదలో కూడా డీఎన్‌ఏ పరీక్షల ద్వారా మృతదేహాల ఆనవాళ్లను గుర్తించే అవకాశం ఉంటుంది. అందుకే డ్రయర్ పేలిన పరిసరాలతోపాటు పరిశ్రమలోని అడుగడుగునా బూడిదను సైతం సేకరించారు. గల్లంతైన వారి ఆచూకీ కనిపెట్టడానికి ఏ అవశేషాన్ని కూడా వదల్లేదు. చివరకు బూడిదలోనూ వారి ఆచూకీ లభించలేదు. తుదకు భూమిని సైతం తవ్వి మృతదేహాల ఆనవాళ్లు సేకరించినా అందులోనూ నిరాశ తప్పలేదు. అయితే డ్రయర్ పేలిన సమయంలో ఆ ఉష్ణోగ్రతకు కార్మికులు పూర్తిగా కరిగిపోవచ్చనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రసాయనాల విస్ఫోటనం పెద్ద ఎత్తున సంభవించడంతో ఎముకలు, మాంసం కరిగిపోయి నీరుగారే అవకాశం ఉందని అంటున్నారు.

ఒక్కొక్కరికీ రూ.15లక్షలు..

గల్లంతైన 8మంది కార్మికుల కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షల చొప్పున చెక్కుల అందజేశారు. పాశమైలారంలోని ఐలా భవన్‌లో వసతి పొందుతున్న ఆ కుటుంబాలతో సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చర్చించారు. ఆచూకీ లభ్యం కానందున ప్రస్తుతానికి తక్షణ పరిహారంగా అందజేస్తున్నామని, మరో 3నెలల వరకు మిగితా పరిహారం గురించి ఒక నిర్ణయానికి వస్తామని చెప్పుకొచ్చినట్లు తెలిసింది. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మిగితా సహాయం కోసం బాధితులు ప్రశ్నించారు.

చనిపోయారని చెప్పినా చిక్కులే..

గల్లంతైనవారు చనిపోయారని చెప్పినా చిక్కులు తప్పవని అధికారులు భావిస్తున్నారు. అందుకే ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రూ.కోటి పరిహారం ఇవ్వాలంటే వారి డెత్ సర్టిఫికెట్లు ఉండాలి. లేదంటే ఏడేళ్ల వరకు ఆచూకీ తేలకుంటే అప్పుడు చనిపోయినట్లుగా ధ్రువీకరించాలనే నిబంధన ఉంది. పైగా ప్రమాదంలో ఎలాంటి ఆనవాళ్ల లభ్యం కావడం లేదు. దీంతో అధికారులకు చట్టపరమైన చిక్కులు వచ్చిపడ్డాయి. ప్రమాద విషయంతోపాటు గల్లంతైనవారి కుటుంబసభ్యుల పరిస్థితిని మానవతా కోణంలో ఆలోచించాలని భావిస్తున్నారు. ప్రత్యేక కేసుగా పరిగణించి త్వరితగతిన ఓ నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జేఎన్టీయూ ప్రతిష్టను దిగజార్చవద్దు

- ప్రిన్సిపాల్ నరసింహ



మాట్లాడుతున్న జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, అధ్యాపకులు

పుల్కల్, జూలై (ఆంధ్రజ్యోతి): నిరాధారమైన ప్రచారం చేస్తూ సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రతిష్టను దిగజార్చవద్దని ప్రిన్సిపాల్ జి. నరసింహ కోరారు. బుధవారం తన ఛాంబర్‌లో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కళాశాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. కళాశాలపై, తనపై అవాస్తవ ఆరోపణలు సరికాదన్నారు. 160 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కళాశాలకు మంచి పేరు ఉందని, విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాలలో అసాంఘిక కార్యకలాపాలపై విచారణ జరపాలని కోరడం విచారకరమని అన్నారు. కళాశాలలో అధ్యాపకులు ఎవరినీ వేధించడం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే రహస్యంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత నాలుగు బ్రాంచ్‌ల నుంచి 12 కోర్సులకు పెంచినట్లు చెప్పారు. కళాశాలలో కాలుష్య నియంత్రణ కోసం మంత్రి దామోదర రాజనరసింహ సహకారంతో విద్యార్థులకు 100 సైకిళ్లను అందజేశామని తెలిపారు. కళాశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు రజినీష్, జోషిశ్రీపాద్, ప్రసన్నలక్ష్మి, బేబీశాలిని తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి సాయిబాబా ఆలయం ముస్తాబు



ఖేడ్‌లోని సాయిబాబా ఆలయం, సాయినాథుడు

నారాయణఖేడ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేటి గురు పౌర్ణమి ఉత్సవాలకు నారాయణఖేడ్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం ముస్తాబైంది. ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి)ని పురస్కరించుకుని ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం 5 గంటలకు కాకడ హారతి, 7 గంటల నుంచి భక్తులచే స్వయం అభిషేకాలు, 8 గంటలకు అలంకరణ, ఉదయం 10 గంటల నుంచి విష్ణు లలిత సహస్రనామ పారాయణాలు, కుంకుమార్చన, పుష్పార్చన, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 56 రకాలతో భక్తులు తయారు చేసిన ప్రసాదాలను సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మహనీయులచే ప్రవచనాలు, హారతి, ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పంచగామలోని పంచలింగేశ్వర ఆలయం ఆవరణలో గురు పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి కాశీనాథ్ బాబా తెలిపారు. అలాగే, ఖేడ్ మండలం కొండాపూర్ శివార్ నందు తండాలోని దక్షిణ కాళికామాత ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



సిద్దిపేట : సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ర్యాలీ

కార్మిక కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు
- ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక సమ్మె నిరసనలు

సంగారెడ్డి రూరల్/సిద్దిపేట అర్బన్/మెదక్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందేనని, అప్పటివరకు పోరాటం ఆపేదిలేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. పటాన్‌చెరు, జిన్నారం, ఐడీఏ బొల్లారం, హత్నూర తదితర చోట్ల పరిశ్రమల్లో కార్మికులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రాలైన సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్‌లలో కార్మికులు భారీ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. సంగారెడ్డిలో ప్రభుత్వ ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం, కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగిన ధర్నానుద్దేశించి చుక్క రాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. వీటిని రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తొలగించి, నాలుగు లేబర్ కోడ్‌లను తేవడం ద్వారా కార్మికుల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మెదక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సమ్మెకు మద్దతుగా ఎల్‌ఐసీ ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

● సిద్దిపేటలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చర్చి గ్రౌండ్ నుంచి విక్టరీ టాకీస్ మీదుగా పాత బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన రావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణపురం లక్ష్మణ్, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచే నరసింహులు మాట్లాడుతూ కేంద్రం కార్మిక వర్గ ద్రోహి అని మండిపడ్డారు. ఈ సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు సత్తయ్య మద్దతు తెలిపారు.

● మెదక్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్మిక నాయకురాలు నర్సమ్మ మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలకు పాల్పడుతుందన్నారు. లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, మెదక్ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, నాయకులు, అంగన్‌వాడీ ఆశా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సిగాచి' పరిహారం ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కుట్రలు

- కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం : బీఆర్‌ఎస్

పటాన్‌చెరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిగాచి మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఎగ్గొట్టేందుకు సర్కార్ కుట్రలు చేస్తుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, ఆదర్శ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పాశమైలారం ఐలా ప్రాంగణంలో ఇంతవరకు మృతదేహాలు లభించని ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా రూ.15 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న శ్రీకాంత్ గౌడ్, ఆదర్శ్‌రెడ్డిలు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.కోటి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కేవలం రూ.15లక్షలు ఇచ్చి వదిలించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. మృతదేహాలు లభించని పక్షంలో డెత్ సర్టిఫికెట్ కోసం ఏడు సంవత్సరాలు పడుతుందని చెప్పడం వెనుక పెద్ద కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు లోపల కూర్చుని అధికారులతో కుమ్మక్కై పరిశ్రమకు అనుకూలంగా పావులు కదుపుతున్నారని, దీన్ని బీఆర్‌ఎస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. హరీశ్ రావు ఆదేశాలతో తాము ఇక్కడికి వచ్చామని, కార్మికుల కుటుంబాలకు అన్యాయం జరిగితే అవసరమైతే హరీశ్‌రావు కూడా ఇక్కడికి వచ్చి ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం కూడా మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తోందని ఆరోపించారు. 60 మంది కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్‌ఐ సదుపాయం కూడా లేకుండా పనిచేయించుకున్నారన్నారు. రాజకీయాలకు తావు లేకుండా మృతుల కుటుంబాలకు న్యాయం జరగాలన్నదే తమ తపన అన్నారు. ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2025 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, టీజీఎంఎస్, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జూలై 13 లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అప్లికేషన్, ధ్రువపత్రాలను జూలై 15లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచితంగా అరుదైన గుండె ఆపరేషన్



రోగికి అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

ములుగు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో బుధవారం నిష్ణాతులైన వైద్య బృందం ఒక నిరుపేద రోగికి అరుదైన అయోటిక్ శస్త్రచికిత్సను ఉచితంగా విజయవంతంగా నిర్వహించింది. మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం, పోగులపల్లి గ్రామానికి చెందిన 52 ఏళ్ల బోనగిరి యాకయ్యకు చిన్నపేగు, కిడ్నీలు, రెండు కాళ్లకు గుండె నుంచి రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళాలు బిగుసుకుపోయి రక్త ప్రసరణ ఆగిపోయింది. ఆయన వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ ఆసుపత్రులు, వైద్యులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. చివరికి ఆర్వీఎం ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించారు. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి అత్యాధునిక చికిత్సను అందించింది. పది గంటల పాటు శ్రమించి అయోటిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్సలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ విజయ్ మోహన్, డాక్టర్ కిషోర్ల బృందం పాలుపంచుకుంది.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

- తల్లులకు కుట్టు మిషన్ శిక్షణ

సిద్దిపేట అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లుల కోసం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఉచిత కుట్టు మిషన్ శిక్షణతో విద్యార్థుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని, కంటి పరీక్షల ద్వారా విద్యార్థుల ఆరోగ్య సమస్యలు కూడా పరిష్కారమవుతాయని అన్నారు. ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కలవేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజు ప్రభాకర్ రెడ్డి, వీవో అధ్యక్షురాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేస్తున్న దాతలు

మర్కుక్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేట్ అండ్ ఎన్రిచ్ ఫౌండేషన్ సౌజన్యంతో మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 241 మంది విద్యార్థులకు రెండు జతల క్రీడా దుస్తులు (స్పోర్ట్స్ యూనిఫాం) అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతీక్ షీలా, ఆయన తల్లిదండ్రులు డా. రమేష్ షీలా, డా. సుచీదారా, కోఆర్డినేటర్ మధు షీలా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ఈ పాఠశాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ప్రకటించారు.

హెచ్ఎం వైఖరితో విద్యార్థులకు అవస్థలు

- గేటు మూసివేయడంతో హైవేపై నడుచుకుంటూ పాఠశాలకు



హాస్టల్ ముందు గేటుకు తాళం వేయడంతో హైవే పై నుంచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

శివ్వంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేట మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహం చెందిన 200 మంది విద్యార్థులు గత పది రోజులుగా ప్రధానోపాధ్యాయుడి వైఖరి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ ముందు నుంచి పాఠశాలలోకి వెళ్లే గేటుకు హెచ్ఎం తాళం వేయడంతో, విద్యార్థులు జాతీయ రహదారిపై చుట్టూ తిరుగుతూ నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని బుధవారం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బంది విద్యార్థులను వరుస క్రమంలో జాతీయ రహదారిపై నుంచి పాఠశాలకు తీసుకువెళ్తున్నారు. ప్రధానోపాధ్యాయుని ఈ వైఖరితో పలు గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు రోడ్డుపైన పాఠశాలకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ ముందు ఉన్న గేటును తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై గిరిజన వసతి గృహం వార్డెన్ యాదయ్యను సంప్రదించగా గేటు తెరవకపోవడంతోనే విద్యార్థులు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.



నిధులొచ్చాయి

ఉమ్మడి జిల్లాలోని 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ. 9.22 కోట్లు మంజూరు

జగదేవ్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహర్దశ వచ్చింది. నిధులు లేక మౌలిక వసతులకు నోచుకోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మొత్తం 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.9.22కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లాలోని 15 జూనియర్ కళాశాలలకు రూ.2.61కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని 17 కళాశాలలకు రూ.3.34 కోట్లు, మెదక్ జిల్లాలోని 14 కళాశాలలకు రూ.3.26 కోట్లు మంజూరు చేస్తూ ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అత్యధికంగా రూ.37.5 లక్షలు మంజూరు కాగా, అత్యల్పంగా మద్దూరు కళాశాలకు రూ.2.95 లక్షలు మంజూరయ్యాయి.

పదేళ్లుగా నిధులు లేవు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు గత పది సంవత్సరాలుగా నిధులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాలను దశాబ్దాల క్రితం నిర్మించగా, అవి మరమ్మతులకు నోచుకోలేదు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం లేకపోవడం, విద్యుత్ సరఫరా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పది సంవత్సరాలుగా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. తాజాగా, గత సంవత్సరం పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్, తాగునీటి పనులకు మోక్షం

నిధుల మంజూరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సరఫరా, మరమ్మతులు, తాగునీటి సౌకర్యాల కల్పనకు మోక్షం లభించినట్లయింది. ఇక కళాశాలల్లో విద్యుత్ తీగల మరమ్మతులు, అన్ని తరగతి గదులలో విద్యుత్ సరఫరా వంటి పనులు చేపట్టనున్నారు. అలాగే, చాలా కళాశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు లభించడం లేదు. కొన్ని కళాశాలల్లో దాతల సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నప్పటికీ, నిర్వహణ లేకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అవసరమైన పనులు చేపట్టనున్నారు. అలాగే, కళాశాలలోని ఇతర మరమ్మతులు కూడా చేయడానికి ఈ నిధులను వినియోగించనున్నారు.

న్యూస్ బాక్స్

నేడు, రేపు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

గజ్వేల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10, 11 తేదీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ సీహెచ్ బాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గజ్వేల్ మండలం కోమటి బండ నుంచి వచ్చే నీటి సరఫరా తగ్గించారని, కొండపాక పంపింగ్ స్టేషన్‌లో పంపుల మరమ్మతుల కారణంగా పూర్తిస్థాయిలో నీటిని అందించలేకపోతున్నట్లు తెలిపారు. మునిసిపల్ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ నెల 10న 1, 2,3,4,5,9,10,11,13,14,15,16,17వార్డుల్లో, ఈ నెల 11న 6,7,8,12,18,19,20 వార్డుల్లో నీటి సరఫరా ఉంటుందని కమిషనర్ తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో బాలకార్మికుడి గుర్తింపు

గజ్వేల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న బాలకార్మికుడిని గుర్తించి బాలసదనానికి తరలించినట్టు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. దుకాణదారుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ

మర్కుక్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేట్ అండ్ ఎన్రిచ్ ఫౌండేషన్ సౌజన్యంతో మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 241 మంది విద్యార్థులకు రెండు జతల స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎడ్యుకేట్ అండ్ ఎన్రిచ్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రతీక్ షీలా వారి తల్లిదండ్రులు డా. రమేష్‌షీలా, డా. సుచీదారా కోఆర్డినేటర్ అండ్ మధుషీలా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్య ఒక్కటే మనిషి జీవితాన్ని మార్చగలదన్నారు. ఇలాంటి పాఠశాలలను బలోపేతం చేయడం కోసం భవిష్యత్తులో పాఠశాలలను తమ ఫౌండేషన్ తరపున దత్తత తీసుకుంటామని ప్రకటించారు.

విద్యార్థు లకు ఉచితంగా కంటి పరీక్ష శిబిరం

సిద్దిపేట అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కలవేని శ్రీనివాస్, ఎంఈవో రాజు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నాట్లు వేసి నిరసన

అక్కన్నపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంతులుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పిక్కుతండా, ధరావత్ తండాకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తండావాసులు రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీటిలో నాట్లు వేసి నిరసన తెలిపారు. తమ తండాలకు వెళ్లేందుకు రహదారులు సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమ తండాలకు రోడ్డు వేయించాలని తండావాసులు, బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రైనా నాయక్ కోరారు.

ఏఈవోలకు అవగాహన

కొండపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొండపాక మండలం దుద్దెడ రైతు వేదికలో జిల్లాలోని 48 మంది వ్యవసాయ విస్తరణ శాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టం పై అవగాహన కల్పించారు.

రూ.లక్షలు వెచ్చించినా లక్ష్యానికి దూరం

- గ్రామాల్లో నిరుపయోగంగా వైకుంఠ ధామాలు
- ఒక్కో శ్మశానవాటికకు రూ.12లక్షలు వ్యయం
- అరకొర సౌకర్యాలతో వృథాగా..
- సొంత భూముల్లోనే అంత్యక్రియలు




వింజపల్లిలో నిరుపయోగంగా ఉన్న శ్మశాన వాటిక, ఎర్రగుంటపల్లిలో చెరువులో నిర్మించిన వైకుంఠధామం

కోహెడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో వైకుంఠధామాల పేరిట శ్మశాన వాటికలను నిర్మించారు. పలు చోట్ల పనులు పూర్తయి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల అధికారుల పర్యవేక్షణ లోపంతో సౌకర్యాలు కరువై వృథాగా మారాయి.

మండలంలో పరిస్థితి ఇలా..

ఉపాధిహామీ కింద నిర్మించిన వైకుంఠధామాల్లో అవసరమైన సౌకర్యాలు లేక అలంకారప్రాయంగా మారాయి. కొన్నిగ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా గ్రామస్థులు వినియోగించుకునేందుకు ముందుకు రావడంలేదు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో వైకుంఠధామానికి రూ.12 లక్షల నిధులు వెచ్చించి నిర్మించారు.. కొన్ని వైకుంఠధామాల్లో బర్నింగ్ షెడ్లు, టాయిలెట్స్ విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో చెరువులో నిర్మించారు. వింజపల్లి గ్రామంలో నిర్మించిన దానిని గ్రామస్థులు వాడడం లేదు. తీగలకుంటపల్లిలో నిర్మించిన గదులకు రేకులు లేచిపోయి ఐదేళ్లకు పైగానే గడిచింది. శనిగరం గ్రామంలో ఓ వ్యక్తి ప్రైవేట్‌గా నిర్మించిన శ్మశానవాటిలో అంత్యక్రియలు జరుపుతున్నారు. పక్కనే వైకుంఠధామం నిర్మించిన దాన్ని ఎవరూ ఉపయోగించడం లేదు. తంగళ్లపల్లిలో అంత్యక్రియలు చేయడానికి ఎవరూ ముందుకు రాక నిరుపయోగంగా ఉంది. బస్వాపూర్, ఆరేపల్లి, పోరెడ్డిపల్లి గ్రామాల్లో వాగులో నిర్మించినా వాటిని ప్రారంభించలేదు. మిగిలిన గ్రామ పంచాయతీలకు ఏ సౌకర్యం కల్పించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తమ సొంత భూముల్లోనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. అప్పటి కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సౌకర్యాలేవీ?

వైకుంఠధామాలు నిర్మించి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా సౌకర్యాలు మాత్రం నామమాత్రంగానే మిగిలిపోయాయి. శ్మశానవాటిక వద్ద విద్యుత్, నీటి సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలి. కానీ విద్యుత్ సౌకర్యం లేక రాత్రికి వెళ్లాలంటే టార్చిలైటే దిక్కు. పలుచోట్ల నీటి సౌకర్యం లేక దహన సంస్కారాలు జరిగిన తర్వాత మరోచోట స్నానానికి వెళ్లాల్సివస్తున్నది. కొన్ని గ్రామాల్లోని శ్మశానవాటికల్లో అసలు బోరుబావులే వేయలేదు. బోర్లు ఉన్నచోట విద్యుత్ సౌకర్యం లేక బోరుబావులు నిరుపయోగంగా ఉండిపోయాయి. విద్యుత్ సరఫరా లేని శ్మశాన వాటిక వద్ద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయాలి కానీ అధికారుల పట్టింపు లేక పనులు నామమాత్రంగా ఉండిపోయాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సర్కారు బడుల్లో ఆకస్మిక తనిఖీలు



గురుకుల పాఠశాల, మద్దూరు ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, డీఈవో రాధిక

సిద్దిపేట కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే వాడాలని కాలం చెల్లిన పదార్థాలు వాడకూడదని సూచించారు. వంటలు శుచిగా రుచిగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వెంట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, ప్రిన్సిపాల్ ఉన్నారు.

- **రాయపోల్:** సారు మాకు మధ్యాహ్న భోజనంలో కూరగాయలు వండడంలేదు అంటూ రాయపోల్ మండలం రామారం ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్పెషల్ ఆఫీసర్‌తో వివరించారు. బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ బాబూనాయక్ ఎంపీడీవో బాలయ్యతో కలిసి రామారం పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులను సమస్యలు అడగగా కూరగాయల విషయం చెప్పారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండాలని అధికారులు నిర్వాహకులకు ఆదేశించారు.

- **మద్దూరు:** మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను బుధవారం డీఈవో రాధిక స్థానిక ఎంపీడీవో రాంమోహన్, ఎంఈవో వరదరాజుతో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. బుధవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'సాంబారుతోనే సరి' అంటూ వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుచిశుభ్రతతో కూడిన భోజనాన్ని అందిస్తున్నది లేనిది పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం చంద్రశేఖరశర్మ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ అలుపెరుగని పోరాటం

జిల్లాలో ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గజ్వేల్/దుబ్బాక/మిరుదొడ్డి/హుస్నాబాద్/చేర్యాల/నంగునూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లావ్యాప్తంగా జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అలుపెరుగని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఏబీవీపీ గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం, 77వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బసవేశ్వర చౌరస్తా నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ తెలంగాణ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాబురావు, మెదక్ విభాక్ కన్వీనర్ ఆకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున ర్యాలీని నిర్వహించారు. అనంతరం దుబ్బాక, మిరుదొడ్డిలో ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. హుస్నాబాద్ పట్టణంలో గాంధీ చౌరస్తా నుంచి అక్కన్నపేట చౌరస్తా వరకు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. చేర్యాలలో ఆయా కళాశాలల విద్యార్థులచే స్థానిక బస్టాండ్ నుండి అంగడిబజారు చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. నంగునూరు జూనియర్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో జెండా ఎగురవేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



సిద్దిపేట రూరల్ మండలం చింతమడక పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ

సిద్దిపేట రూరల్/ములుగు/బెజ్జంకి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం పోలీసులు విద్యార్థులకు సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు రక్షణ, నూతన చట్టాలపై సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోక్సో చట్టాల గురించి షీటీం విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజిరెడ్డి, ఎస్ఐ కిషన్, తదితరులు పాల్గొన్నారు. ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ విజయ్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించగా, బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్‌లో ఎస్ఐ బి. సౌజన్య సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

కొమురవెల్లి, నాచగిరి దేవస్థానం క్షేత్రాల్లో వనమహోత్సవం

చేర్యాల/వర్గల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కొమురవెల్లి మండలంలోని మల్లన్న ఆలయం, వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాల్లో బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఆధ్వర్యంలో రాజీవ్‌రహదారి సమీపంలోని ఆలయ పరిధిలోని భూమిలో పూలు, బిల్వం, నీడనిచ్చే మొక్కలు నాటారు. కొమురవెల్లి తహసీల్దారు దివ్య మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఈవో అన్నపూర్ణ మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వర్మ, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది ఆలయ పరిసరాలలో మొక్కలు నాటారు.

తాడూరులో కాడెడ్ల అపహరణ

చేర్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన గుమ్మల కనకయ్యకు చెందిన రెండు కాడెడ్లను గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి అపహరించుకుపోయారు. ఎప్పటిలాగే వ్యవసాయపనులు ముగించుకుని కాడెడ్లను పశువుల పాకలో కట్టివేయగా, బుధవారం ఉదయం బావివద్ద కాడెడ్లు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. సుమారు రూ.1.70లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

చేయూత ఏదీ?

(5వ పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ అందిస్తామని చెప్పడంతో గత 18 నెలలుగా తమకు పెన్షన్ ఎప్పుడొస్తుందోనని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

పాత పెన్షన్‌నే అమలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే పెన్షన్‌ను పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, గత 18 నెలలుగా పాత పెన్షన్ విధానాన్నే అమలు చేస్తున్నది. అధికారంలోకి వస్తే గతంలో అమలు చేస్తున్న పెన్షన్ రూ. 2,016 నుంచి రూ. 4 వేలకు పెంచుతామని, వికలాంగులకు అందిస్తున్న రూ. 4,016 నుంచి రూ. 6 వేలకు పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత 18 నెలలు గడుస్తున్నా, హామీని అమలు చేయకపోవడంతో పెన్షన్‌దారులు మండిపడుతున్నారు.

గౌరవప్రదంగా బతుకుతున్నాం

గతంలో ప్రతి చిన్న పనికీ కుటుంబసభ్యులపై ఆధారపడాల్సి ఉండేది. మాకు ఒక చిన్న మందు గోలీ కావాలన్నా, మరేదైనా వస్తువు కొనుగోలు చేయాలన్నా ఇబ్బందికరంగా ఉండేది. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఆసరా, ప్రస్తుతం అందిస్తున్న చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం లభించడంతో గౌరవప్రదంగా బతుకుతున్నాం, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన పెన్షన్ పెంపును ఇప్పటికైనా అందించాలని కోరుతున్నా.

- ఎల్లయ్య, పెన్షన్‌దారుడు

అర్జున్‌పట్లలో ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ



అర్జున్‌పట్లలో ట్రాక్టర్ బ్యాటరీ, బంపర్, సెల్ఫ్ మోటరు ఎత్తుకెళ్లిన దొంగలు

మద్దూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అర్జున్‌పట్ల గ్రామంలో ట్రాక్టర్ల బ్యాటరీ చోరీలతో ట్రాక్టర్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన అహ్మద్ షరీఫ్ తన వ్యవసాయ పొలం వద్ద ట్రాక్టర్‌తో దున్ని రాత్రి ట్రాక్టర్‌ను బురద పొలం వద్దే వదిలేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ బంపర్, సెల్ఫ్ మోటారుతో పాటు బ్యాటరీ చోరీకి గురైనట్లు గుర్తించారు. అలాగే దేవరాయల మల్లేశంకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. మండలంలో ట్రాక్టర్ల బ్యాటరీల చోరీల వరుస ఘటనలతో ట్రాక్టర్ల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

- ఒకరికి రెండు రోజుల జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా రూ.52,500 జరిమానా విధిస్తూ న్యాయాధికారులు తీర్పు చెప్పారు. వారిలో ఒకరికి జరిమానాతో పాటు జైలుశిక్ష విధించారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ.25వేల జరిమానా విధించారు. గజ్వేల్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని గజ్వేల్ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా నిందితులకు రూ.27,500 జరిమానా విధించారు. అందులో ఒకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్షను విధిస్తూ తీర్పుచెప్పారు.

దాడులు చేసుకున్న ఇరు వర్గాల వారికి రిమాండ్

కొండపాక జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో పరస్పర దాడులు చేసుకున్న వ్యక్తులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 12న అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఎల్లమ్మ గుడి వద్ద కల్లు తాగే ప్రాంతంలో పాత కక్షలతో గౌడ కులస్థుల్లో ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పరస్పర దాడులకు పాల్పడిన వారిలో సాదుపల్లి సంతోష్, సాదుపల్లి బాల్ రాజ్ గౌడ్, సాదుపల్లి కైలాష్, సాదుపల్లి వరుణ్, తాళ్లపల్లి లక్ష్మణ్, సాదుపల్లి వెంకవ్వ, సాదుపల్లి కవిత, తాళ్లపల్లి భవానీ, తాళ్లపల్లి సాయిలు, శిక లింగం, శిక రాఘవేంద్ర ఉన్నారు. దర్యాప్తు అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా వారికి 14రోజుల రిమాండ్ విధించారు. నిందితులను చంచల్ గూడ జైలుకు పంపినట్టు సీఐ తెలిపారు.

దమ్ముంటే కేసీఆర్, కేటీఆర్ అసెంబ్లీకి రావాలి

- కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎవరి ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి కృషి చేశామో వివరించేందుకు దమ్ముంటే కేసీఆర్, కేటీఆర్‌లు అసెంబ్లీకి రావాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతుల సంక్షేమం జరిగిందని ఆ విషయాన్ని ప్రజల ముందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. దానిని సవాల్‌గా స్వీకరించిన కేటీఆర్ దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉండాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు ధైర్యముంటే అసెంబ్లీలో చర్చకు పెట్టాలని స్పీకర్‌కు లేఖ రాయాలని సవాల్ విసిరారు. వెంట సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, యువజన పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, స్టేట్ మైనార్టీ కార్యదర్శి హర్షద్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు సలీం ఉన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ




అగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు

దౌల్తాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రైతులు సాగు చేసిన పంటలకు యూరియా అందక అవస్థలు పడుతున్నారు. బుధవారం మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 500 బస్తాల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల రైతులు అగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకొని బారులు తీరారు. క్యూలైన్‌లో ఉన్న ఒక్కో రైతుకు 3 బస్తాలు ఇచ్చారు. చాలా మంది రైతులకు యూరియా దొరకక నిరాశతో వెనుదిరిగారు. మక్కజొన్న పంటకు యూరియా వేసే సమయంలో యూరియా అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకింగ్ రంగంలో మంచి అవకాశాలు

సిద్దిపేట కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో బ్యాంకింగ్ రంగంలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మారుతి కొండయ్య తెలియజేశారు. బుధవారం సిద్దిపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన బ్యాంకింగ్ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలు వాటిలో యువత పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సులో మారుతి కొండయ్య పాల్గొని బ్యాంకింగ్ రంగ విశిష్టతను తెలియజేశారు. సొంతంగా బిజినెస్ చేయాలి అనుకున్న వారికి లేదా విద్యా రంగానికి సంబంధించిన ఎలాంటి లోనైనా బ్యాంకులో సులభంగా ఇస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌బీఐ బ్యాంక్ ఆఫీసర్ సంతోష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్య ప్రకాష్ రావు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మద్దూరు జీపీలో సంబరాలు చేసుకుంటున్న గ్రామైఖ్య సంఘాల మహిళలు

చిన్నకోడూరు/కుకునూరుపల్లి/మద్దూరు/జగదేవ్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో సుధీర్ పేర్కొన్నారు. చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరులో బుధవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆయన డీపీఎం విద్యాసాగర్‌తో కలిసి పాల్గొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ముఖ్య అతిథిగా మండల ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మద్దూరు మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో గ్రామైఖ్య సంఘాల మహిళలు ముగ్గులు వేసి సంబరాలను జరుపుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్‌లో మహిళా మండలి సమాఖ్య భవనంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

పరుగుతోనే జీవితం మెరుగు

సిద్దిపేట కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న 3వ ఎడిషన్ హాఫ్ మారథాన్ రన్ పోస్టర్‌ను ప్రెస్‌క్లబ్‌లో బుధవారం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాఫ్ మారథాన్ రన్‌కు జర్నలిస్టుల సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అందరికీ ఆరోగ్యం పంచడమే లక్ష్యంగా, మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె సక్సెస్

- కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి
- జిల్లా వ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు



గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ పట్టణాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

గజ్వేల్/దుబ్బాక/మిరుదొడ్డి/హుస్నాబాద్/బెజ్జంకి/మద్దూరు/కొండపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల్లో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దుచేయడంతో పాటు 29కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 12 గంటల పని విధానం సరికాదన్నారు. గజ్వేల్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని యూనియన్ బ్యాంకు నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులున్నారు. దుబ్బాకలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వివిధ రంగాలకు చెందిన కార్మికులతో పెద్దఎత్తున ర్యాలీని నిర్వహించారు. మిరుదొడ్డి,అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో కూడా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ధర్మారం గ్రామంలో దేశాయిబీడీ కంపెనీని మూసివేసి హెచ్‌ఎంఎస్ లక్ష్మన్ ఆధ్వర్యంలో సమ్మెను నిర్వహించారు. చేర్యాలలో సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్ నుంచి వీరభద్ర కళామందిర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. జగదేవ్‌పూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్లమ్మ దేవాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో సీపీఎం నాయకులు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మద్దూరు మండల కేంద్రంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో బుధవారం సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం ,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్వయంభు శంభూ దేవాలయం నుంచి రాజీవ రహదారి మీదుగా జీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.